3 నుంచి టెట్

- 21వ తేదీ వరకు నిర్వహణ
- ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది కేంద్రాలు
- 60,574 మంది అభ్యర్థులు
- పరీక్ష కేంద్రాల్లోకి అరగంట ముందు అనుమతి
- పక్కాగా ఏర్పాట్లు
- కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వచ్చే నెల మూడో తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్న టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని విశాఖపట్నం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. టెట్ నిర్వహణపై శనివారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఏడు కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో ఒక కేంద్రంలో ఆన్‌లైన్‌లో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలకు మొత్తం 60,574 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, ఈనెల 22వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ అవుతున్నాయని వివరించారు. ఫొటో లేని హాల్ టికెట్‌తో వస్తే తాజా పాస్‌పోర్టు ఫొటో తీసుకుని పరీక్షకు అనుమతించాలన్నారు. పరీక్షలకు బాలింతలు, దివ్యాంగులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి నిర్ణీత సమయం కంటే అరగంట ముందే అనుమతించాలన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారిని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఏఎన్‌ఎంను నియమించాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని,

... మిగతా 6వ పేజీలో



నగరంలో అంధకారం

- వెలగని వీధి దీపాలు
- రోడ్లపై చీకటిరాజ్యం
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, నేరాలు
- జీవీఎంసీకి ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- నోటీస్ ఇచ్చామన్న కమిషనర్
- రెండు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో చీకటిపడితే అంధకారం రాజ్యమేలుతోంది. దాదాపు సగం వీధి దీపాలు వెలగకపోవడంతో వీధుల్లోనూ, ప్రధాన రోడ్లపైనా చీకట్లు అలముకుంటున్నాయి. ఇది రోడ్డు ప్రమాదాల పెరుగుదలకు కారణమవుతోంది. అదేవిధంగా నేరగాళ్లకు అవకాశంగా మారుతోంది. వీధి దీపాల సమస్యపై ఎవరు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అక్కయ్యపాలెం రామచంద్రానగర్‌లో వెలగని విద్యుద్దీపాలు

హుద్‌హుద్ తుపాన్ (2014) తర్వాత అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు నగరంలో 1.18 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటుచేశారు. వీటి ఏర్పాటుతోపాటు నిర్వహణకు ఢిల్లీకి చెందిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏడేళ్లపాటు వీధి దీపాల నిర్వహణ బాధ్యత చూసేందుకుగాను రూ.85 కోట్లు చెల్లించేందుకు జీవీఎంసీ అంగీకరించింది. ఒప్పందం ప్రకారం ఎక్కడైనా వీధి దీపం పాడైపోతే 48 గంటల్లోగా ఏజెన్సీ అమర్చాల్సి ఉంటుంది. లేనిపక్షంలో జీవీఎంసీకి జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటుచేసిన తర్వాత కొంత కాలం పాటు నిర్వహణ బాగానే ఉండేది. కానీ సముద్రపు గాలులు, వాతావరణంలో మార్పుల కారణంగా ఎల్ఈడీ లైట్లు మరమ్మతులకు గురవుతుండేవి. వాటిని సకాలంలో మార్చడం, మరమ్మతు చేయడంలో ఏజెన్సీ విఫలమవ్వడంతో సమస్య మొదలైంది. 2022తో ఏజెన్సీ ఒప్పంద గడువు పూర్తయ్యింది. అయినప్పటికీ కొంతకాలం అదే ఏజెన్సీకి అప్పగించారు. ఆ తరువాత జీవీఎంసీ స్వయంగా వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు నిర్వహించింది. కొన్నాళ్ల కిందట జీవీఎంసీ ఎన్‌బీఎం ఏజెన్సీతో ఒప్పందం చేసుకుంది. అయితే కాంట్రాక్టర్ అవసరమైనంత సిబ్బందిని నియమించకపోవడంతో నగరంలో వీధి దీపాల సమస్య తీవ్రమైంది. వీధి దీపాలు ఎక్కడైనా పాడైపోతే ఫిర్యాదు అందిన తర్వాత నెలలు

... మిగతా 6వ పేజీలో

సీఆర్‌జెడ్‌లో పబ్!

ఏడాదిన్నరగా నిర్వహణ

- ఇంటి నిర్మాణమని చెప్పి అనుమతి... వ్యాపారానికి వినియోగం
- పట్టించుకోని అధికారులు
- ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీకి అందిన ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఏపీసీజెడ్ఎం లేఖ



కాపులుప్పాడలో నిర్మించిన విరాగు పబ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో భీమిలి బీచ్‌రోడ్డులో ఇష్టానుసారంగా నిర్మాణాలు జరిగాయి. ఎవరూ నిబంధనలు పాటించలేదు. అధికారులు కూడా కనీస పరిశీలన లేకుండా అనుమతులు ఇచ్చేశారు. అందులో ఒకటి విరాగు పబ్.

భీమిలి మండలం తిమ్మాపురం సర్వే నంబర్ 329/5ఏలో కాపులుప్పాడ గ్రామం వద్ద దీనిని నిర్మించారు. ఈ ప్రాంతం కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్)-3 పరిధిలోకి వస్తుంది. అందులో ఏదైనా వ్యాపార కార్యక్రమం నిర్వహించాలనుకుంటే అవసరమైన నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ) నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాలి. కానీ భవన నిర్మాతలు అలా చేయలేదు. అక్కడ గృహ నిర్మాణం చేపడుతున్నామని చెప్పి జీవీఎంసీ నుంచి అనుమతులు తీసుకున్నారు. ఆ స్థలం ముందు నుంచి 30 మీటర్ల మాస్టర్ ప్లాన్ రహదారి ఉంది. దాని ప్రకారం 14 శాతం స్థలాన్ని ఓపెన్ స్పేస్‌గా విడిచి పెట్టాలి. ఆ నిబంధన కూడా పాటించలేదు. 2022 జూన్‌లో అనుమతి తీసుకుని భవనం నిర్మించారు. దానిని ఏడాదిన్నరగా పబ్ కోసం వినియోగిస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్, స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటుచేసి పూర్తిగా వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీరి చర్యల వల్ల జీవీఎంసీకి సుమారు రూ.20 లక్షల ఆదాయం పోయింది.

పట్టించుకోని జిల్లా స్థాయి కమిటీ

సీఆర్‌జెడ్ నోటిఫికేషన్ 2011 ప్రకారం తీర ప్రాంతం ఉన్న జిల్లాల్లో కలెక్టర్ చైర్మన్‌గా, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారి మెంబర్ కన్వీనర్‌గా జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ ప్రకారం విశాఖ జిల్లాలో 2023 మేలో కమిటీ ఏర్పాటైంది. తీర ప్రాంతంలో నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నవారు నిబంధనలు పాటిస్తున్నారా?, లేదా?... అనేది పర్యవేక్షిస్తూ ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఈ కమిటీకి ఉంది. అయితే జిల్లాలో ఈ కమిటీ చురుగ్గా పని చేయడం లేదు. సమావేశాలు నిర్వహించడం తప్పితే క్షేత్రస్థాయిలో పరిశీలనలు, తనిఖీలు చేయడం లేదు. అందువల్ల ఏడాదిన్నరగా విరాగు పబ్ సీఆర్‌జెడ్-3లో నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై ఇటీవల జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ ఏపీసీజెడ్ఎంఏకి ఫిర్యాదు చేయడంతో స్పందన లభించింది. మెంబర్ కన్వీనర్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసి, విరాగు నిర్మాణాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సుమారు వారం రోజులు అవుతోంది. ఇప్పటివరకూ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

బే వాచ్‌పై విచారణకు ఏపీసీజెడ్ఎంఏ ఆదేశం



విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తొట్లకొండలో ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ లీజుకు ఇచ్చిన బే వాచ్ రిసార్ట్‌లో కోస్తా నియంత్రణ మండలి నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినట్టు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ) జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసింది. జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్ బే వాచ్ రిసార్ట్‌లో నిబంధనల

... మిగతా 6వ పేజీలో

వెనక్కి తగ్గిన ఉక్కు యాజమాన్యం

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు నిర్ణయం తాత్కాలికంగా వాయిదా

- దశల వారీగా తగ్గింపునకు ప్రణాళిక
- ఎవరినైతే తొలగించాలనుకుంటున్నారో వారి గేట్ పాస్‌లు (పసుపు రంగు) వెనక్కి తీసుకోవాలని నిర్ణయం
- వాటి స్థానే తెలుపు రంగువి జారీ
- రెన్యువల్ సమయంలో నెమ్మదిగా నిలిపివేతకు ఆలోచన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల తొలగింపు విషయంలో ఒక అడుగు వెనక్కి వేసింది. ప్లాంటులో ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగనందున కాంట్రాక్టు కార్మికుల్లో 33 శాతం మందిని తొలగించాలని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఆదేశించడంతో సుమారు నాలుగు వేల మందిని ఆపేందుకు శుక్రవారం రాత్రి అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, తరచూ విధులకు గైర్హాజరవుతున్న వారిని తీసేశారు. వారి పేర్లు అన్ని

... మిగతా 6వ పేజీలో



కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించవద్దంటూ శనివారం స్టీల్‌ప్లాంట్ పరిపాలనా భవనం వద్ద నినాదాలు చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అన్యాయం

- ఒక్కరిని తొలగించినా ఊరుకోం
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు
- యాజమాన్యం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ - 6లో

అనధికార కాల్ సెంటర్లపై దాడులు

- నిరుద్యోగుల నుంచి నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు



మూతపడిన కార్యాలయం

మురళీనగర్, సెప్టెంబర్ 28: విశాఖ నగరంలో అనధికారికంగా నడుస్తున్న కాల్ సెంటర్లపై పోలీసులు దాడులు చేపట్టారు. ఉద్యోగాలు ఇస్తామంటూ నిరుద్యోగుల నుంచి నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందడంతో చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.

జాతీయ రహదారిపై మురళీనగర్ బిర్లా జంక్షన్ వద్ద బొత్స స్క్వేర్‌లో 'విజన్ లాజిక్ ఇన్ఫో' పేరిట 20 రోజుల క్రితం ఓ కాల్ సెంటర్‌ను తెరిచారు. భవన యజమానికి మాత్రం తమది లాజిస్టిక్స్ వ్యాపారంగా చెప్పారు. తమకు పలు బ్రాంచీలు ఉన్నాయని చెప్పి... బొత్స స్క్వేర్ (అపార్టుమెంట్)లో పాస్‌పోర్ట్ కార్యాలయం వెనుక వైపు సెకండ్ ఫ్లోర్‌లో ఈ కార్యాలయాన్ని తెరిచారు. అద్దెకు తెచ్చిన కంప్యూటర్లతో కార్యకలాపాలు నడిపారు. తాను విశాఖ ఎండాడలో నివాసం ఉంటున్నట్టు 'విజన్ లాజిక్ ఇన్ఫో' నిర్వాహకుడు అక్షయ్ పట్వాల్ బొత్స స్క్వేర్

... మిగతా 6వ పేజీలో

లయ తప్పుతున్న గుండె



ఉత్తరాంధ్రలో పెరుగుతున్న బాధితులు

ఉత్తరాంధ్ర ప్రాంతంలో గత కొన్నేళ్లుగా గుండె జబ్బులు బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు 50 ఏళ్లు దాటితేనే గుండె సంబంధిత సమస్యలు కనిపించేవి. ఇప్పుడు మూడు పదులు నిండనివారు కూడా బాధితులవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 1.9 కోట్లు మంది గుండె జబ్బులు బారినపడి ప్రాణాలను కోల్పోతున్నారు. ఉత్తరాంధ్రలోనూ ఈ సంఖ్య అధికంగానే ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. గుండె సంబంధిత సమస్యలతో విశాఖలో చిన్నా, పెద్ద ఆస్పత్రుల్లో కలిపి సగటున ప్రతిరోజూ 200 మంది వరకు చేరుతున్నట్టు వైద్యులు వెల్లడిస్తున్నారు. జీవన శైలి, ఆహారపు అలవాట్లు దీనికి కారణమంటున్నారు. గుండె జబ్బులపై

- నగర పరిధిలోని ఆస్పత్రుల్లో గుండె జబ్బులతో ప్రతిరోజూ కనీసం 200 మంది చేరిక
- జీవనశైలి, పొగతాగడం, ఫ్యామిలీ హిస్టరీ, మానసిక ఒత్తిడి, ఒబెసిటీ, కొలెస్ట్రాల్ వంటివే ప్రధాన కారణం
- నేడు అంతర్జాతీయ హృదయ దినోత్సవం

ప్రజల్లో అవగాహన కలిగించేందుకు వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ఏటా సెప్టెంబరు 29న వరల్డ్ హార్ట్ డే నిర్వహిస్తోంది.

నేడు వరల్డ్ హార్ట్ డే నేపథ్యంలో అందిస్తున్న కథనం. - వార్త I పేజీలో

7 నుంచి 12 వరకు ఏయూకు దసరా సెలవులు

విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ నేపథ్యంలో అక్టోబరు ఏడో తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సెలవులు ప్రకటిస్తున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు తెలిపారు. వర్సిటీతోపాటు అనుబంధ కళాశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. సెలవుల అనంతరం వచ్చే నెల 14వ తేదీన వర్సిటీతోపాటు కాలేజీలు పునఃప్రారంభం అవుతాయన్నారు.

పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, సెప్టెంబరు 28: విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన 108 మంది పోలీసు సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ప్రతిభ కనపరచిన సిబ్బంది సేవలకు ప్రోత్సాహకంగా వీటిని అందించారు. హోమ్ గార్డు నుంచి సీఐ స్థాయి వరకు రివార్డు మంజూరు ఉత్తర్వులు అందజేశారు. మరింత మెరుగ్గా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీసు అధికారులు పలువురు పాల్గొన్నారు.

సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరిని కాపాడిన లైఫ్ గార్డులు

మహారాణిపేట, సెప్టెంబరు 28: ఆర్‌కే బీచ్ వద్ద సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరు పర్యటకులను లైఫ్ గార్డులు కాపాడారు. శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు స్నేహితులు సరదాగా గడిపేందుకు ఆర్‌కే బీచ్‌కు వచ్చారు. ఈక్రమంలో పార్వతీపురానికి చెందిన ఎస్.రంగారావు, చిత్తూరుకు చెందిన కె.చైతన్యలు సముద్రంలో దిగి ఆడుతుండగా తీవ్ర అలలకు మునిగి కొట్టుకు పోతుండటంతో గమనించిన లైఫ్ గార్డులు ధనరాజు, నవీన్‌లు వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 28: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ప్రభుత్వ కంటి ఆస్పత్రి సిబ్బంది ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 6 నుంచి 10 చదువుతున్న విద్యార్థులందరికీ కంటి పరీక్షలు చేసి తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ ఎ.సునంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థికి అభినందన



జగదీష్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రభాకర్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 2: జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన తమ పాఠశాల విద్యార్థి జగదీష్‌రెడ్డిని శనివారం జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అభినందించారు.

గుర్రం జాషువాకు ఘననివాళి

కంచరపాలెం, సెప్టెంబరు 29: సంఘ సంస్కర్త గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ 55వ వార్డు జాషువా నగర్‌లో ఘన నివాళులర్పించారు. ఇక్కడి కళా ప్రాంగణంలో జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు జాషువా చేసిన సేవలను గుర్తు చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామ కమిటీ ప్రతినిధులు గుడివాడ నరిసింగరావు, గుమ్మడి ఆదినారాయణ మూర్తి, ప్రసాద్, స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

పోషకాలు అందితేనే పిల్లల్లో ఎదుగుదల

మర్రిపాలెం, సెప్టెంబరు 28: పిల్లలకు సరైన పోషకాలు అందించినప్పుడే ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి పేర్కొన్నారు. గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం, ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో ఉన్న ఐసీడీఎస్ విశాఖ అర్బన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పిల్లల ఎదుగుదలలో లోపాల నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లి, బిడ్డకు పోషకాలు అందించడమే లక్ష్యంగా మహిళ శిశు సంక్షేమశాఖ పనిచేస్తుందన్నారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పొలమరశెట్టి నర్సకుమారి, శ్యామల దీపిక, పొలమరశెట్టి శ్రీనివాసరావు, సీడీపీఓ రమణకుమారి, సహాయక సీడీపీఓ శ్రీలత, సెక్టర్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాతనగరం అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే వంశీకృష్ణ



'ఇది మంచి ప్రభుత్వం' సంచిక ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కూటమి నాయకులు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 28: పాతనగరం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. కూటమి వందరోజుల పాలనతో ప్రజలకు మరింత చేరువైందని, నియోజవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని పునరుద్ఘాటించారు. శనివారం 36 నుంచి 39 వార్డుల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వంద రోజులో అన్ని వర్గాల ప్రజల మన్నన పొందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు హామీల అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. వార్డుల్లో విశేష సంఖ్యలో మహిళలు, స్థానిక ప్రజానీకం తరలివచ్చారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్లు సాధిక్, గోడి విజయలక్ష్మి, టీడీపీ నాయకులు గోడి నరసింహాచారి. కేదారి లక్ష్మి, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ కె.పుణ్యవతి, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్ ప్రారంభం

జగదాంబ కూడలి: మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. శనివారం జోన్ 4 కార్యాలయంలో స్వయం సహాయ సంఘాల నేతృత్వంలో పలు రకాల చేతి వృత్తి తయారీ ఉత్పత్తుల స్టాల్స్‌ను జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ కె.పుణ్యవతితో కలసి ఆయన సందర్శించారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మెప్మా మార్కెట్ సౌలభ్యం చేకూర్చడం పట్ల అభినందించారు. స్వయం సహాయక సంఘాల మహిళల నైపుణ్యం ఇక్కడ ఉత్పత్తుల ద్వారా బహిర్గతమైందని అభిప్రాయపడ్డారు. కొనుగోలుదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్, కూటమి శ్రేణులు, ఆర్పీలు, స్వయంసహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

పూర్ణామార్కెట్,: గ్రేటర్ 35వ వార్డు సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణా మార్కెట్): గణపతి ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్ద ఎత్తున భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని వర్తకులు ఏర్పాటు చేశారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీడీపీ దక్షిణ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ అన్న వితరణను ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథుని నిమజ్జన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూర్ణామార్కెట్‌లోని వ్యాపారాలు పూర్తిగా నిలిచిపోయాయి. వన్‌టౌన్ పోలీసులు భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సెయింట్ జోసెఫ్‌లో అంతర కళాశాలల ప్రతిభాపోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 28: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ద్వితీయ భాషావిభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులకు అంతర కళాశాలల ప్రతిభాపోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.సింహాద్రినాయుడు, సెయింట్ జోసెఫ్ ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ హాజరయ్యారు. నగరంలోని వీఎస్ కృష్ణ, గాయత్రి, ఏవీఎన్, విశాఖ మహిళా కళాశాల, బీవీకే, సెయింట్ ఏన్స్, ఆదిత్య, ప్రిజమ్ కళాశాలల నుంచి డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారని ద్వితీయ భాషావిభాగాధిపతి డా.పీకే జయలక్ష్మి తెలిపారు. వక్తృత్వం, పద్య పఠనం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, హాస్యవల్లరి తదితర పోటీలను హిందీ, సంస్కృతం, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థినులకు అతిథులు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డా.నిర్మల, డా.దీప్తి, సిస్టర్ మేరీ, అంజలే, డా.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 28: పూర్ణామార్కెట్ వద్ద దుర్గాలమ్మ గుడిలో వచ్చే నెల 3 నుంచి 12 వరకు శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, దుర్గాలమ్మగుడి ఈవో పైలా శేఖర్ తెలిపారు. శనివారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణను కలసి ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రారంభోత్సవానికి ఆయనను ఆహ్వానించారు.

అక్కయ్యపాలెం: సుబ్బలక్ష్మినగర్‌లోని చింతామణి గణపతి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ముఖద్వారం ఎదుట దేవి నవరాత్రుల పందిరి రాట ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీవీఎస్ఎల్ రాజు, వసంత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి కటాక్షం అందిరిపైనా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, మళ్ళ శ్రీను దంపతులు, నానాజీ, చరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పిడికిలి బిగిద్దాం రండి

▸▸ ప్రజా సంఘాల నేతల పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతంపేట, సెప్టెంబరు 28: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబరు 2న చేపట్టనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి. రమణమూర్తి, ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఉద్యమ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రమణమూర్తి మాట్లాడుతూ కేంద్రం విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడానికి దూకుడు పెంచుతున్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ఉదయం 9 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. రాజకీయ నాయకులు పొంతన లేని మాటలతో కార్మికులను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం నుంచి రావద్దన్న 4,090 మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సమావేశానికి విచ్చేసిన ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రం ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఉత్తరాంధ్ర ప్రజానీకం ఉద్యమించాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించారు. ప్రజా సంఘాల నాయకులు ఎం.లక్ష్మి, వై.నూకరాజు, జె.రవి, కె.ఎస్. చలం, కె.పద్మ, సూర్యప్రకాష్, రవి, చినసూర్యనారాయణ, ఉప్పల లక్ష్మణరావు, డెంకాడ ఆనంద్, సీఎంఎస్ లలిత, సుధాకర్, మేడ మస్తాన్ రెడ్డి, పి.ఎస్. తిలక్, ఎస్ఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

'సన్'కు ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ అవార్డు



రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్ జాస్తి, ఆశాజాస్తి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 28: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో నగరానికి చెందిన సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్‌కు ఉత్తమ పర్యాటక విద్యా సంస్థగా రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా సన్ సీఎండీ శ్రీకాంత్ జాస్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 20 సంవత్సరాలుగా విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంతాల్లో ఎంతో మంది విద్యార్థులను పర్యాటక రంగంలో ఉత్తములుగా తీర్చిదిద్దామని తెలియజేశారు. చదువుతో పాటు విదేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాల విలువలు తెలియజేయడం, కళలు, క్రీడ, పండుగల ఆచరణ విధానం విద్యార్థులకు తెలియజేశామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి దుర్గేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 28: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల శనివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు 'వేస్ట్ టు ఆర్ట్' అంశంపై పోటీలు నిర్వహించింది. ఎన్‌సీసీ క్యాడెట్లు తమ సృజనాత్మకతను చూపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ వ్యర్థాల నుంచి ఉపయోగపడే వస్తువులు తయారు చేయడంపై అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు వ్యర్థాల నుంచి గృహాలంకరణ వస్తువులు తయారు చేసి ప్రతిభను నిరూపించుకోవడం ఆనందదాయకమన్నారు. సృజనాత్మకత పెంపొందించడం, ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ కెగీతాంజలి, కో-ఆర్డినేటర్ బి.సంతోషి, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 28: విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలని ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్యాలయం హాల్‌లో భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా సంయుక్త ఆధ్వర్యంలో భారత్ కో జానో , గురువందన్ ఛత్రాభినందన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని బీవీపీ ప్రాంత్ అధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గురువు దైవంతో సమానమని, విద్యార్థులకు గురువు ప్రాముఖ్యతను తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులు వాగ్దేవి పి.శ్యామలతో పాటు ఉత్తమ విద్యార్థులను సత్కరించారు. బీవీపీ ప్రతినిధులు రమేష్‌చంద్ జైన్, ఎంవీవీ సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, ఎం.ఎస్.ఎల్.శైలజ, జగదీష్ ప్రసాద్, వెంకటేశ్వరరావు, సీహెచ్‌వీ సత్యనారాయణ, భాస్కరరావు, వి.మాణిక్యాలరావు, పి.షిర్మల, సీహెచ్ నిర్మలాదేవి పాల్గొన్నారు.

శారీరక వ్యాయామంతోనే గుండె పదిలం



బీచ్‌రోడ్డులో ర్యాలీలో పాల్గొన్న వైద్య ప్రముఖులు, ఇతరులు

మహారాణిపేట, సెప్టెంబరు 28: యువతలో గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ డీకే బారుహ్ అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం బీచ్‌రోడ్డులో గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తూ వాక్‌థాన్ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు వైద్య ప్రముఖులు, వైద్యనిపుణులు సుమారు రెండు వేల మందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ధూమపానం, మద్యపానం, నిల్వ పదార్థాలకు (జంక్ ఫుడ్స్) దూరంగా ఉండాలని సూచించారు. రోజూ సుమారు 45 నిమిషాలు నడవాలని, పాఠశాలల్లో యోగా, ధ్యానం ప్రవేశపెట్టాలని తెలిపారు. సెల్ కంప్యూటర్ గేమ్‌లతో ఎక్కువ సమయం గడపవద్దని, ఉప్పు, చక్కెర హానికరమని హెచ్చరించారు. వాక్‌థాన్‌లో ప్రముఖ గుండె వైద్యులు ఎస్.కె.పాణిగ్రహి, డాక్టర్ త్రివేది, డాక్టర్ ఎల్ విజయ, డాక్టర్ సి.శశాంక్, డాక్టర్ చక్రధర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అంధకారం

... 5వ పేజీ తరువాయి

దాటినాసరే మరమ్మతులు చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు ఎన్నిసార్లు నోటీసులు జారీచేసినా పట్టించుకోవడం లేదు. నగరంలో 1.18 లక్షల ఎల్‌ఈడీ వీధి దీపాలు ఉండగా వాటిలో ప్రస్తుతం సుమారు 58 వేల వరకూ వెలగడం లేదని అంచనా. దీనివల్ల చీకటిపడితే చాలు అనేక ప్రాంతాల్లో చీకటి రాజ్యమేలుతోంది. కొమ్మాది నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకూ జాతీయ రహదారిపై అనేక స్ట్రెచ్‌లల్లో దీపాలు వెలగడం లేదు. నగర శివారు ప్రాంతాలైన మధురవాడ, పీఎం పాలెం, అగనంపూడి, భీమిలి, వడ్లపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో అయితే రాత్రిపూట అంధకారం సర్వసాధారణంగా మారిపోయింది. నగర నడిబొడ్డున అక్కయ్యపాలెం, రామచంద్రనగర్, ఆబిద్ నగర్, 80 ఫీట్ రోడ్డు, శ్రీనివాసనగర్, బాలయ్యశాస్త్రిలేఅవుట్, సీతమ్మధార, కంచరపాలెం, కప్పరాడ వంటి ప్రాంతాల్లో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చైన్‌స్నాచింగ్‌లు, ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయి. అలాగే పాదచారులు రాత్రివేళ రోడ్డు దాటుతున్నపుడు వాహనచోదకులు గుర్తించలేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తోపాటు జిల్లా కలెక్టర్ హరేందిర్ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి రాత్రివేళ వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నగరంలో కొన్నిచోట్ల వీధిదీపాలు వెలుగుతున్నాసరే వాటి నుంచి అంతంతమాత్రంగా కాంతి వస్తుండడంతో వాటి ఇల్యుమినేషన్ సామర్థ్యాన్ని పెంచాలని సీపీ కోరారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా కార్పొరేటర్లతోపాటు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సైతం వీధి దీపాల సమస్యపై విరుచుకుపడ్డారు. రాత్రిపూట నగరంలో అరాచకం రాజ్యమేలుతోందని విష్ణుకుమార్‌రాజు ఆగ్రహం వ్యక్తంచేసారు. గంజాయి బ్యాచ్‌లు చెలరేగిపోతున్నాయని, నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. జీవీఎంసీ ఏడాదికి సుమారు రూ.12 కోట్లు ఖర్చు చేస్తున్నా కాంట్రాక్టర్ పనులు ఎందుకు చేయడం లేదంటూ ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. దీనికి కమిషనర్ సంపత్ కుమార్ సమాధానం ఇస్తూ తాను కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదుసార్లు నగరంలో రాత్రిపూట పర్యటన చేసి, వీధి లైట్ల సమస్యపై సమీక్ష చేశానన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కనిపించడంతో అతన్ని ఎందుకు తొలగించకూడదంటూ షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. కొద్దిరోజుల్లో వైఖరి మారకపోతే మరొక నోటీసు జారీచేసి తర్వాత న్యాయపరమైన వివాదాలకు అవకాశం లేకుండా కాంట్రాక్టర్‌ను తొలగిస్తామన్నారు. రెండు నెలల్లో వీధి దీపాల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

3 నుంచి టెట్

... 5వ పేజీ తరువాయి

పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు. దివ్యాంగుల కోసం స్క్రైబ్స్‌ను బయట నుంచి అనుమతించరని, ఇందుకు విద్యా శాఖే ఏర్పాట్లుచేయాలన్నారు. దివ్యాంగులకు పరీక్ష రాయడానికి అదనంగా 50 నిమిషాల సమయం కేటాయించాలన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో అభ్యర్థుల కోసం ఉదయం ఏడు నుంచి రాత్రి ఏడు గంటల వరకు కమాండ్ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. సమీక్షలో విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగన్నాథరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాయింట్-1గా మోహన్‌రావు బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూపర్ బజార్ ఆవరణలోని రిజిస్ట్రేషన్ల కార్యాలయంలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా మోహన్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో విజయవాడ ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న గ్రేడ్-1 సీనియర్ సబ్ రిజిస్ట్రార్ సంజీవయ్య ఈ స్థానాన్ని ఎంపిక చేశారు. అయితే, ఏసీబీ కేసులు పెండింగ్ ఉండటంతోపాటు గతంలో ఐజీగా రామకృష్ణ పనిచేసిన సమయంలో సంజీవయ్య షాడో ఐజీగా వ్యవహరించారు. అన్ని జిల్లాల నుంచి ప్రతి పనికి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ స్థితిలో ఆయనను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కీలక స్థానం నుంచి తప్పించారు. అయితే, బదిలీల కౌన్సెలింగ్‌లో సీనియారిటీ ప్రకారం విశాఖలో జాయింట్-1 పోస్టును ఆయన ఎంచుకున్నారు. గతంలో మధురవాడలో, భీమిలిలో పనిచేసిన సమయంలో అనేక అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడినట్టు ఫిర్యాదులు అందడంతో ఐజీ కార్యాలయం ఆయన బదిలీ ఉత్తర్వులను రద్దు చేసింది. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయం కావడంతో మరో సీనియర్ గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రావును ఆ స్థానంలో నియమించారు. దాంతో ఆయన శనివారం బాధ్యతలు తీసుకున్నారు.

ఉద్యోగాలకు ఇద్దరు కెమికల్ విద్యార్థులు ఎంపిక

కంచరపాలెం, సెప్టెంబరు 29: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో ప్లాస్టిక్స్ & పాలీమర్స్ ఏడో సెమిస్టర్ చదువుతున్న శ్రీ వంశీ (పెట్రో కెమికల్స్), ప్రవీణ్ (ఆయిల్ టెక్నాలజీ) అనే విద్యార్థులు ప్రముఖ కంపెనీ ఆదిత్య బిర్లా పెయింట్స్ డివిజన్‌కు ఎంపికయ్యారు. వీరు ఏడాదికి ప్రారంభ వేతనం రూ.3.3 లక్షలతో ఉద్యోగాలు సాధించారు. తమ విద్యార్థులు ప్రాంగణ ఎంపికద్వారా ఉద్యోగాలు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు అభినందించారు. ఇటీవల తమ కళాశాల విద్యార్థి చైతన్య దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో వార్షికవేతనం రూ.10.4 లక్షలతో ఉద్యోగం సాధించాడని తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను పెట్రోకెమికల్స్ విభాగాధిపతి డా.ఎస్.ప్రశాంత కుమారి, డా.బీవీ.లక్ష్మణరావు, బి.రామాంజనేయులు, బి.స్మిత అభినందించారు.

అనధికార కాల్ సెంటర్లపై దాడులు

... 5వ పేజీ తరువాయి

యజమానికి తెలిపాడు. అయితే, ఒక్కసారిగా వీరి వ్యాపార బాగోతం సీబీఐ అధికారుల మెరుపు దాడులతో బయటపడేసరికి భవన యజమాని కంగుతిన్నారు. కార్యాలయాన్ని మూసి వేసిన సీబీఐ అధికారులు అక్కడకు ఎవరినీ రానివ్వలేదు. వీరి కార్యాలయాల నుంచి లాప్ ట్యాప్‌లు, హార్డ్ డిస్కులు, కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మురళీనగర్‌లో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడే కార్యాలయాలు, అనుమానితుల సమాచారం తెలియజేయాలని ప్రజలను పోలీసు అధికారులు కోరారు.

బే వాచ్‌పై విచారణకు ఏపీసీజెడ్ఎంఏ ఆదేశం

... 5వ పేజీ తరువాయి

ఉల్లంఘనపై కలెక్టర్ హరేందిర్ ప్రసాద్‌కు ఇటీవల ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దానిపై జిల్లా పర్యాటక శాఖ అధికారిణితో విచారణ చేయించారు. ఆ నివేదిక సమర్పించడంలో జాప్యం జరగడంతో మూర్తియాదవ్ ఏపీసీజెడ్ఎంఏకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దానిని జిల్లా స్థాయి కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్‌కు మెంబర్ కన్వీనర్ పంపించారు. దానిపై విచారణ చేసిచర్యలు తీసుకోవాలన్నారు.

వెనక్కి తగ్గిన ఉక్కు యాజమాన్యం

.. 5వ పేజీ తరువాయి

బయోమెట్రిక్ యంత్రాల నుంచి తొలగించారు. వారు పొరపాటున వచ్చినా హాజరు పడకుండా చేశారు. ఈ విషయం తెలిసి కార్మిక సంఘాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. శనివారం ఉదయం భారీ ర్యాలీ తీసి, నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. ఈ విషయాన్ని ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ఎంపీ శ్రీభరత్‌కు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆందోళనలో పోలీసుల వల్ల ఏమైనా జరిగితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని వివరించారు. దాంతో వారు ఉన్నత స్థాయిలో చర్చలు జరిపారు. సెయిల్‌లో విలీనం చేసే ఆలోచన ఉందని వార్తలు రావడంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు సంతోషంలో ఉన్నాయని, ఇప్పుడు ఈ కాంట్రాక్టు కార్మికుల తొలగింపుతో పరిస్థితి అదుపు తప్పుతుందని, ఆ నిర్ణయం వాయిదా వేయాలని కోరారు. దానికి సమ్మతి లభించడంతో ఆ విషయం కార్మిక సంఘాల నాయకులకు తెలియజేశారు. ప్రస్తుతం ఎవరినీ ఆపడం లేదని, అంతా యథాప్రకారం విధులకు హాజరు కావచ్చుననే సమాచారం పంపారు. దాంతో శనివారం నాటి ఆందోళన ఉధృతి తగ్గిపోయింది.

దశల వారీగా తగ్గింపు

విశాఖ ఉక్కులో ప్రస్తుతం ఉత్పత్తికి అవసరమైన వారి కంటే అధికంగా కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని భావిస్తున్న కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఒక్కసారి కాకుండా దశల వారీగా తొలగించాలని యాజమాన్యానికి సూచించింది. ఇందులో భాగంగా ఎవరినైతే తొలగించాలని గుర్తించారో వారికి ఇచ్చిన గేట్ పాస్‌లు (పసుపు రంగు) వెనక్కి తీసుకోవాలని నిర్ణయించారు. వాటి స్థానంలో తెలుపు రంగు గేట్‌పాస్‌లు ఇస్తారు. ఆ పాస్‌లు కలిగిన వారిని దశల వారీగా ఆపేస్తారు. కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చే గేట్ పాస్ కాలపరిమితి మూడు నెలలు. ఆ సమయం దాటిన తరువాత తొలగించాలనుకున్నవారి పాస్‌లు రెన్యువల్ చేయరు. కొనసాగించాలనుకున్న వారికి మాత్రమే కొత్తవి ఇస్తారు. కార్మిక వర్గాల్లో ఆందోళనకు తావివ్వకుండా గప్‌చుప్‌గా ఈ పని చేయాలని యాజమాన్యానికి సూచించడంతో తొలగింపు ప్రక్రియకు తాత్కాలింగా బ్రేక్ వేశారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అన్యాయం

▸▸ ఒక్కరిని తొలగించినా ఊరుకోం ..

▸▸ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

▸▸ యాజమాన్యం తన నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్



జెండాలతో నినదిస్తున్న కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28: స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మండిపడ్డారు. కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సుమారు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం సరికాదన్నారు. ప్లాంటును రక్షిస్తామని ఒక పక్క ప్రకటనలు చేస్తూనే మరోపక్క తొలగింపు ప్రక్రియకు యాజమాన్యం పూనుకోవడం దారుణమన్నారు. దీనివల్ల కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ప్లాంటు కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆలోచనను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, మంత్రి రాజశేఖర్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి, దొమ్మేటి అప్పారావు, జె.రామకృష్ణ, నమ్మి సింహాద్రి, పీవీ రమణమూర్తి, జీవీ సుబ్బయ్య, కె.రాజుబాబు, వి.ప్రసాద్, మంత్రి గోపినారాయణ పాల్గొన్నారు.

ఒక్కరిని తొలగించినా ఉద్యమం

స్టీల్‌ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించినా తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. ప్లాంటు ఎల్ఎంఎంఎం విభాగ క్యాంటీన్‌లో శనివారం నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇప్పటికే చాలీచాలనీ జీతాలతో కాలం గడుపుతున్న కాంట్రాక్టు కార్మికులను రోడ్డున పడేసేందుకు యాజమాన్యం చూస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల తొలగింపు సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు మంత్రి రవి, శ్రీనివాసరాజు, అవతారం, అప్పారావు, సొంబాబు పాల్గొన్నారు.

యథావిధిగా విధులకు కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికులు మొత్తం శనివారం విధులకు హాజరయ్యారు. ప్లాంటులో సుమారు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు సిద్ధమైన యాజమాన్యం...వారి వివరాలను ఆయా కాంట్రాక్టర్‌లకు పంపించింది. అయితే కాంట్రాక్టర్లు మాత్రం కార్మికులను ఆపలేదు. తమకు నోటీసులు ఇస్తే అప్పుడు చూస్తామని సమాధానమిచ్చారు. ఒకేసారి ఇంతమందిని విధుల నుంచి తప్పిస్తే ఉద్యమాలు జరుగుతాయని భావించి దఫదఫాలుగా తొలగించేందుకు యాజమాన్యం యత్నిస్తుందని కార్మిక నాయకులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఒక్క కార్మికుడిని తొలగించినా ఉద్యమిస్తామని హెచ్చరించారు.



వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీవారికి లక్ష తులసి పూజ

అగనంపూడి, సెప్టెంబరు 28: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకుని శనివారం లక్ష తులసి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు, నిత్యం హోమంతో పాటు పూర్ణాహుతి నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి కమిటీ ప్రతినిధి ఎం.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గరుడాద్రిపై ఏకాదశి పూజలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పూజలను వైభవంగా జరిపారు. సుప్రభాత సేవ అనంతరం నూతన వస్త్రాలతో శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.అప్పలరెడ్డి, ఎ.అప్పారావు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

వేపగుంట, సెప్టెంబరు 28: కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఈ నెల 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం నాయకులు ఆర్.ఆర్.వి.పురం ఎలక్ట్రికల్ స్టోర్ వద్ద పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గోపాలపట్నం జోన్ ప్రధాన కార్యదర్శి ఎం. ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు బి.వెంకటరావు, అనుసూయ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

జుత్తాడలో క్రీడా పోటీలు రేపు

పెందుర్తి, సెప్టెంబరు 28: మండల పరిధి వాలిమెరక జుత్తాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30 నుంచి నియోజకవర్గ స్థాయిలో బాలబాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం ఎస్‌బీవీ సత్యకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ తదితర అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయన్నారు. ఆసక్తి గల వారు క్రీడా సమన్వయకర్తను సంప్రదించాలని కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎన్.ఎ.డి. జంక్షన్, సెప్టెంబరు 28: జీవీఎంసీ 90వ వార్డు గాంధీనగర్‌లో రహదారి పనులకు శనివారం కార్పొరేటర్ బొమ్మిడిరమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్‌కు అనుసంధానంగా ఉన్న గాంధీనగర్ నుంచి రైల్వే గెడ్డ వరకు ఉన్న రహదారి అధ్వానంగా తయారైందన్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు సమస్యను ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో జీవీఎంసీ నిధులు రూ.19.84 లక్షలు విడుదలవ్వడంతో సీసీ రోడ్డు, కాలువలు నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ రత్నాకర్‌రెడ్డి, ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, నాయకులు మళ్ల అప్పారావు, పైడిరాజు, ఎ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ పన్నులు చెల్లించవచ్చు

వేపగుంట సెప్టెంబరు 28: వేపగుంట జోన్-8 పరిధిలోని 89 నుంచి 98 వార్డులకు చెందిన ప్రజలు 2024-25 మొదటి సంవత్సరంలోని అర్ధ సంవత్సర పన్నులను ఈ నెల 30 లోగా చెల్లించాలని జెడ్సీ కె.హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కొళాయి, ఇళ్ల పన్నులను చెల్లించేందుకు వీలుగా ఆదివారం సౌకర్యం కేంద్రం తెరిచే ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సినిమా గైడ్

- **సత్యం సుందరం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శారద, రమాదేవి, వెంకటేశ్వర, సంగం, శరత్, శ్రీరామ, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), సుకన్య, సౌజన్య నరసింహ, శ్రీనరసింహ, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ, సప్తగిరి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 40, టమాటా 44, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 24, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 24, క్యారెట్ 44, దొండకాయలు 40, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 85, మునక్కాడలు (కిలో) 90, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 34, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 68, పొటల్స్ 36, కీరదోస 26, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 98
ఫారం ధర	-- 118
విత్ స్కిన్	-- 206
స్కిన్‌లెస్	-- 216

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

విధులకు వెళ్లేటప్పుడు ప్రజెంట్.. వచ్చేటప్పుడు ఆబ్సెంట్!

శుక్రవారం నైట్ డ్యూటీకి వెళ్లిన ఉక్కు కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి ఇది..

శనివారం ఉదయం బయోమెట్రిక్‌లో కానరాని జనరల్ షిఫ్ట్ కార్మికుల వివరాలు

ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్న కార్మికులు



బయోమెట్రిక్ వేసి ప్లాంట్‌లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కార్మికులు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ నేత అయోధ్యరామ్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28: విశాఖ ఉక్కు కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న సుమారు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను కేంద్రం ఆదేశాల మేరకు తొలగించాలని యాజమాన్యం నిర్ణయించడంతో శనివారం కార్మికులు ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. శుక్రవారం రాత్రి నుంచి యాజమాన్యం గేటు పాసులను ఆన్‌లైన్‌లో రద్దు చేయడం, ఈ విషయం కార్మికులకు తెలియకపోవడంతో వారు అయోమయంలో పడ్డారు. శుక్రవారం రాత్రి విధులకు హాజరైన కాంట్రాక్టు కార్మికులు గేటు వద్ద గల బయోమెట్రిక్ మిషన్‌లో హాజరు నమోదు చేసుకున్నారు. తిరిగి శనివారం ఉదయం విధులు ముగించుకుని గేటు వద్దకు వచ్చి బయోమెట్రిక్ వేస్తే పడలేదు. ఎందుకు ఇలా జరిగిందో అర్థం కాక కాంట్రాక్టు కార్మికులంతా ఆందోళనకు గురయ్యారు. విధులకు వెళ్లేటప్పుడు ప్రజెంట్ పడి, దిగేటప్పుడు బయోమెట్రిక్‌లో పడకపోతే ఆబ్సెంట్ కింద ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఇదిలా ఉండగా శనివారం ఉదయం జనరల్ షిఫ్ట్ కార్మికుల్లో కొంత మంది గేటు వద్ద బయోమెట్రిక్ వేసేందుకు ప్రయత్నించగా మిషన్‌లో వివరాలు కనిపించలేదు. దీంతో ఆందోళనతో కర్మాగారంలోని కాంట్రాక్టు కార్మికులంతా ఆయా విభాగాలకు విధులకు వెళ్లారు. అయితే కొన్ని విభాగాల కాంట్రాక్టర్లు ఉక్కు యాజమాన్యం తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు యథావిధిగా పని అప్పగించగా, మరికొన్ని విభాగాల్లో మాత్రం యాజమాన్యం తొలగింపు నిర్ణయం తీసుకుందని, ఇకపై పనికి రావాల్సిన అవసరం లేదని, గేటు పాసులు ఇవ్వాలని సూచించారు. ఏమైనా ఉంటే ఉక్కు యాజమాన్యంతో మాట్లాడుకోవాలని తేల్చిచెప్పారు. దీంతో కొన్ని విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మిక నాయకులు ఆయా విభాగాల అధికారులతో మాట్లాడినప్పటికీ యాజమాన్యం నుంచి విధుల్లోకి తీసుకోవాలని తమకు ఎలాంటి ఆదేశాలు లేవని చెప్పారు. ఏదిఏమైనా శనివారం చాలావరకు కాంట్రాక్టు కార్మికులు పనులు చేశారు. ఆదివారం సెలవు కావడం వల్ల సోమవారం ఏం జరుగుతుందోనని కాంట్రాక్టు కార్మికులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర విధానాలను ఉద్యమాలతో ప్రతిఘటిస్తాం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంటును రక్షిస్తామంటున్నారు కానీ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోబోమని కేంద్ర మంత్రి చెప్పడం దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,325వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉక్కు యాజమాన్యం సుమారు నాలుగు వేల మంది కార్మికులకు తొలగించేందుకు యత్నిస్తుండడం దారుణమన్నారు. కేంద్రం విధానాలను ఉద్యమాలతో ప్రతిఘటిస్తామన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు సంక్షోభానికి కేంద్ర విధానాలే కారణమని, కార్మికులకు యాజమాన్యం ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఎన్నో కుటుంబాలను రోడ్డుపాలు చేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, పుల్లారావు, మరిడయ్య, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను మంటగలిపిన వైసీపీ

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట, సెప్టెంబరు 28: తిరుమల పవిత్రతను గత వైసీపీ ప్రభుత్వం మంటగలిపిందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు విమర్శించారు. వేపగుంట వీరాంజనేయస్వామి ఆలయం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో హిందూ దేవాలయాల్లో విగ్రహాల నరికివేత, రథం కాల్చివేత, దుర్గమ్మ గుడిలో అనేక అపచారాలు జరిగినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ స్థితిలో సనాతన ధర్మాన్ని కాపాడడానికి పవన్‌కల్యాణ్ చేస్తున్న దీక్షకు అన్ని వర్గాల నుంచి మద్దతు పలుకుతుండటంతో వైసీపీ నాయకులు ఆయనపై అక్కసుతో ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30, అక్టోబరు 1, 2 తేదీల్లో ఆలయాల్లో దీపారాధన, గీతాపారాయణ తదితర కార్య క్రమాలను చేపట్టనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వార్డు అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి, రీజనల్ కో-ఆర్డినేటర్ సుధ, నాయకులు రాము నాయుడు, టి.శ్రీనివాస్, చైతన్య, శ్రీను, బి.సురేశ్, నాగరాజు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు ఆర్థిక పురోగతి సాధించాలి

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు



రైతుబజారులో అర్బన్ మార్ట్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న గణబాబు

గోపాలపట్నం, సెప్టెంబరు 28: స్వయం సహాయ సంఘాలు ఆర్థికంగా ప్రగతి సాధించే దిశగా అడుగులు వేయాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. స్థానిక రైతుబజారులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్ట్ ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సహకారాన్ని డ్వాక్రా మహిళలందరికీ సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబనను సాధించాలని సూచించారు.

ఈ సందర్భంగా డ్వాకా సంఘాల మహిళలు నిర్వహిస్తున్న పలు వ్యాపారాలకు సంబంధించిన వస్తు ప్రదర్శనను ఆయన తిలకించారు. కార్యక్రమంలో యూసీడీ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

లడ్డూ వ్యవహారంపై సీబీఐతో విచారణ చేపట్టాలి

మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 28: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సీబీఐతో విచారణ చేపట్టి ప్రజలకు వాస్తవాలు తెలపాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఆయనతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా హిందువులు ఎంతో పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూను రాజకీయ లబ్ధి కోసం సీఎం చంద్రబాబు వినియోగించుకోవడం బాధాకరన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, వైసీపీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఉరుకూటి అప్పారావు, గుడివాడ లతీశ్, ఈటి శ్యామలరావు, సంద్రాన నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం: మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ప్రజలకు కనీసం మేలు చేకూరలేదని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. స్థానిక వెంకటాద్రి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు మతం పేరిట రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంటును విక్రయానికి పెట్టారని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు విడనాడాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాడి ఉమామహేశ్, మెంటి మహేశ్, గొరపల్లి శ్రీను, చిరికి దేవుడు, బోకం రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా వైసీపీ, టీడీపీ నాయకుల పూజలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వైసీపీ, టీడీపీ నాయకులు పోటాపోటీగా ములగాడ హౌసింగ్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ ఏడు వార్డుల వైసీపీ నాయకులతో ప్రత్యేక పూజలు చేసి, సీఎం చంద్రబాబు దేవుడుతో ఆటలాడకుండా చూడాలని ప్రార్థించారు. వైసీపీ కార్పొరేటర్లు పీవీ సురేశ్, బల్ల లక్ష్మణరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. వారు వెళ్లిన తర్వాత టీడీపీ నాయకులు ఆలయానికి చేరుకుని వైసీపీ అధినేత జగన్ తిరుమల లడ్డూ విషయంలో దారుణం చేస్తే ఇక్కడి నాయకులు శ్రీవారికి పూజలు చేసి గుడిని అపవిత్రం చేశారంటూ గుడిని, మెట్లను పసుపునీళ్లతో శుభ్రం చేశారు. కూటమి నాయకులు మిలిరెడ్డి శంకర్, పుర్రె సురేశ్, పోలిమేర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హార్ట్‌ఫుల్‌నెస్ గురు ధాజీ జన్మదిన వేడుకలు

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 28: మర్రిపాలెం వుడా కాలనీ సమీపంలోని రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్‌లో శనివారం సంస్థ గ్లోబల్ హెడ్ గురు ధాజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆరున్నర నుంచి సంస్థ ప్రధాన కేంద్రం కన్హా నుంచి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తూ ఇక్కడి సాధకులు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ధాజీ జీవిత విశేషాలు, దశనియమాలు, భండారా సందేశం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 29 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు తుంగ్లాంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 28: స్ఫూర్తి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్, మెడికవర్ ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం తుంగ్లాం కాలనీలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. కాలనీలోని విజయ రాఘవస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తున్న నిర్మాణంలో ఉన్న రహదారి

దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డులో వర్షపు నీరు తిష్ఠ

ఇబ్బందులకు గురవుతున్న స్థానికులు, ప్రయాణికులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 28: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు రహదారి, నాగదేవత కొండ.. దానిని ఆనుకుని ఉన్న అభివృద్ధి పనుల ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ నీరు వెళ్లే మార్గాలు పూడికలతో నిండిపోవడంతో తరచూ నీరు తిష్ఠ వేస్తుందని స్థానికులతో పాటు రైలు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుండడంతో భరించరాని దుర్గంధంతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.

79వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం'

అగనంపూడి, సెప్టెంబరు 28: జీవీఎంసీ 79వ వార్డు పరిధి అన్నపూర్ణానగర్, జూబిలి హిల్స్ ప్రాంతాల్లో టీడీపీ వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవాని ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, టి.రేవతి, సాయిలక్ష్మి, మంగ, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవ రాత్రి ఉత్సవాలకు పందిరి రాట

అగనంపూడి, సెప్టెంబరు 28: అగనంపూడి కూడలిలో శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పందిరి రాట వేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు, స్థానిక నాయకుడు కొయ్య వెంకటకృష్ణారెడ్డి పందిరి రాట వేసి పూజలు చేశారు. అక్టోబరు మూడున దుర్గాదేవి ప్రతిమను ప్రతిష్ఠిస్తామని, 12వ తేదీ వరకు వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గుర్రం శ్రీను, సింగిడి సింహాచలం, టి.వెంకటరమణ, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్'లో లతా మంగేష్కర్ జయంతి

అగనంపూడి, సెప్టెంబరు 28: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం భారతరత్న, ప్రముఖ నేపథ్య గాయిని లతా మంగేష్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ సుమారు ఇరవై భాషల్లో 50 వేలకు పైగా పాటలు పాడిన మహోన్నత వ్యక్తి లతా మంగేష్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో సతీశ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ సత్యనారాయణ

ఇళ్ల కేటాయింపును వేగవంతం చేయాలి

హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ సత్యనారాయణ

గాజువాక, సెప్టెంబరు 28: పేదలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయింపులను వేగవంతం చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ సత్యనారాయణ అన్నారు. జోనల్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, లబ్ధిదారుల ఎంపిక విషయంలో మరోసారి విచారణ చేయాలని, అర్హులకు ఇళ్లు కేటాయించాలని సూచించారు. అధికారులు ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, డీఈ రామకృష్ణ, ఏఈలు గోపాలకృష్ణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో భగత్‌సింగ్‌కు నివాళి

పెదగంట్యాడ, సెప్టెంబరు 28: విప్లవజ్యోతి భగత్‌సింగ్ జయంతిని శనివారం పెదగంట్యాడలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పెంటయ్య, ఎం.సాంబశివరావు, ఎం.అప్పారావు, ఎన్.అప్పలరెడ్డి, మొల్లి సోమునాయుడు, పులి సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28: రాష్ట్రంలోనే అతి పెద్ద సొసైటీగా 12,993 మంది సభ్యులతో రూ.367 కోట్ల టర్నోవర్‌తో స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ముందుకు సాగుతుందని సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ అన్నారు. స్టీల్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన 60వ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం రూ.5.04 కోట్ల నికర లాభాన్ని తమ సొసైటీ ఆర్జించిందని, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 24 శాతం డివిడెండ్ చెల్లించనున్నామన్నారు. కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది కూడా సంఘం ఆడిట్ వర్గీకరణలో ఏ-గ్రేడ్ పొందిందన్నారు. కోశాధికారి డీవీవీఎస్ఎస్ కొండరాజు 2023-24 సంవత్సరం లెక్కలను, సవరించిన బడ్జెట్‌ను, లాభాల పంపిణీని సభ్యుల ముందు ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ప్రతినెలా సభ్యుల త్రిఫ్ట్ ఫండ్, వలంటరీ త్రిఫ్ట్ ఫండ్, ఆర్‌బీఎఫ్ మొత్తాలను నెలవారి లోన్ వాయిదాకు మళ్లించడం ద్వారా ప్లే స్లిప్ నందు లోన్ రికవరీ ఆపివేసేందుకు చేసిన బైలా ప్రతిపాదలను సభ్యులు ఆమోదించారు. డైరెక్టర్లు కె.శ్రీనివాస్, ఎంవీ రమణ, వీజీ మహిధర్, చీఫ్ మేనేజర్ దామోదరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 28: దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అదుపులోనికి తీసుకున్నారు. వీరి నుంచి లక్షా నాలుగువేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, సిబ్బంది, దువ్వాడ ఎస్ఐ ఎల్ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై శనివారం దాడి చేశారు. పేకాడుతున్న ఎనిమిది మంది తప్పించుకునేందుకు యత్నించగా పోలీసులు వారిని నిలువరించి అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 28: షీలానగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించిన సొసైటీ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డికు షీలానగర్ అప్‌కీప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం తుంగ్లాంలో గోవిందరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. 1981లో 328 ఇళ్లతో ఏర్పడిన బీహెచ్‌పీవీ ఉద్యోగుల కాలనీ (షీలానగర్)లో ప్రజల సౌకర్యార్థం ఆస్పత్రి, వాటర్ ట్యాంక్, పాఠశాల, తదితర వాటి కోసం స్థలాలను కేటాయించారు. అయితే ఈ స్థలాలను ప్రస్తుతం కొంతమంది ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలని అసోసియేషన్ నాయకులు నాయకులు వైసత్యవతి, బీఎస్ఎస్ రాజు, కృష్ణమోహన్‌లు కోరారు.

బధిర బాలుడుకి 'హెల్పింగ్ హ్యాండ్స్' సాయం

పెందుర్తి, సెప్టెంబరు 28: దివ్యాంగ బాలునికి దాతల సహకారంతో పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ రూ.10 వేలను ఆర్థిక సాయంగా అందజేసింది. ఈశ్వరరెడ్డి పుట్టుకతోనే బదిరుడు. ఈ చిన్నారికి వైద్య ఖర్చులు చేసేందుకు ఆర్థిక స్థోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు దాడి శ్రీనును సంప్రదించారు. దీంతో దాతల ద్వారా సమకూర్చిన రూ.పది చెక్కును శ్రీను అందజేశారు.

పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, సెప్టెంబరు 28: విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన 108 మంది పోలీసు సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ప్రతిభ కనపరచిన సిబ్బంది సేవలకు ప్రోత్సాహకంగా వీటిని అందించారు. హోమ్ గార్డు నుంచి సీఐ స్థాయి వరకు రివార్డు మంజూరు ఉత్తర్వులు అందజేశారు. మరింత మెరుగ్గా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీసు అధికారులు పలువురు పాల్గొన్నారు.

సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరిని కాపాడిన లైఫ్ గార్డులు

మహారాణిపేట, సెప్టెంబరు 28: ఆర్కే బీచ్ వద్ద సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరు పర్యటకులను లైఫ్ గార్డులు కాపాడారు. శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు స్నేహితులు సరదాగా గడిపేందుకు ఆర్కే బీచ్‌కు వచ్చారు. ఈక్రమంలో పార్వతీపురానికి చెందిన ఎస్.రంగారావు, చిత్తూరుకు చెందిన కె.చైతన్యలు సముద్రంలో దిగి ఆడుతుండగా తీవ్ర అలలకు మునిగి కొట్టుకు పోతుండటంతో గమనించిన లైఫ్ గార్డులు ధనరాజు, నవీన్‌లు వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 28: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ప్రభుత్వ కంటి ఆస్పత్రి సిబ్బంది ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 6 నుంచి 10 చదువుతున్న విద్యార్థులందరికీ కంటి పరీక్షలు చేసి తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ ఎ.సునంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థికి అభినందన



జగదీష్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రభాకర్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 2: జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన తమ పాఠశాల విద్యార్థి జగదీష్‌రెడ్డిని శనివారం జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అభినందించారు.

గుర్రం జాషువాకు ఘననివాళి

కంచరపాలెం, సెప్టెంబరు 29: సంఘ సంస్కర్త గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ 55వ వార్డు జాషువా నగర్‌లో ఘన నివాళులర్పించారు. ఇక్కడి కళా ప్రాంగణంలో జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు జాషువా చేసిన సేవలను గుర్తు చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామ కమిటీ ప్రతినిధులు గుడివాడ నరిసింగరావు, గుమ్మడి ఆదినారాయణ మూర్తి, ప్రసాద్, స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

పోషకాలు అందితేనే పిల్లల్లో ఎదుగుదల

మర్రిపాలెం, సెప్టెంబరు 28: పిల్లలకు సరైన పోషకాలు అందించినప్పుడే ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి పేర్కొన్నారు. గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం, ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలో ఉన్న ఐసీడీఎస్ విశాఖ అర్బన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పిల్లల ఎదుగుదలలో లోపాల నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లి, బిడ్డకు పోషకాలు అందించడమే లక్ష్యంగా మహిళ శిశు సంక్షేమశాఖ పనిచేస్తుందన్నారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పొలమరశెట్టి నర్సకుమారి, శ్యామల దీపిక, పొలమరశెట్టి శ్రీనివాసరావు, సీడీపీఓ రమణకుమారి, సహాయక సీడీపీఓ శ్రీలత, సెక్టర్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాతనగరం అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే వంశీకృష్ణ



'ఇది మంచి ప్రభుత్వం' సంచిక ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కూటమి నాయకులు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 28: పాతనగరం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. కూటమి వందరోజుల పాలనతో ప్రజలకు మరింత చేరువైందని, నియోజవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని పునరుద్ఘాటించారు. శనివారం 36 నుంచి 39 వార్డుల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వంద రోజులో అన్ని వర్గాల ప్రజల మన్నన పొందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు హామీల అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. వారుల్లో విశేష సంఖ్యలో మహిళలు, స్థానిక ప్రజానీకం తరలివచ్చారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్లు సాదిక్, గోడి విజయలక్ష్మి, టీడీపీ నాయకులు గోడి నరసింహాచారి. కేదారి లక్ష్మి, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ కె.పుణ్యవతి, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్ ప్రారంభం

జగదాంబ కూడలి: మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. శనివారం జోన్ 4 కార్యాలయంలో స్వయం సహాయ సంఘాల నేతృత్వంలో పలు రకాల చేతి వృత్తి తయారీ ఉత్పత్తుల స్టాల్స్‌ను జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీడీ కె.పుణ్యవతితో కలసి ఆయన సందర్శించారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మెప్మా మార్కెట్ సౌలభ్యం చేకూర్చడం పట్ల అభినందించారు. స్వయం సహాయక సంఘాల మహిళల నైపుణ్యం ఇక్కడ ఉత్పత్తుల ద్వారా బహిర్గతమైందని అభిప్రాయపడ్డారు. కొనుగోలుదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్, కూటమి శ్రేణులు, ఆర్పీలు, స్వయంసహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

పూర్ణామార్కెట్,: గ్రేటర్ 35వ వార్డు సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణా మార్కెట్): గణపతి ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్ద ఎత్తున భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని వర్తకులు ఏర్పాటు చేశారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీడీపీ దక్షిణ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ అన్న వితరణను ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథుని నిమజ్జన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూర్ణామార్కెట్‌లోని వ్యాపారాలు పూర్తిగా నిలిచిపోయాయి. వన్‌టౌన్ పోలీసులు భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సెయింట్ జోసెఫ్‌లో అంతర కళాశాలల ప్రతిభాపోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 28: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ద్వితీయ బాషావిభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులకు అంతర కళాశాలల ప్రతిభాపోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.సింహాద్రినాయుడు, సెయింట్ జోసెఫ్ ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ హాజరయ్యారు. నగరంలోని వీఎస్ కృష్ణ, గాయత్రి, ఏవీఎన్, విశాఖ మహిళా కళాశాల, బీవీకే, సెయింట్ ఏన్స్, ఆదిత్య, ప్రిజమ్ కళాశాలల నుంచి డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారని ద్వితీయ భాషావిభాగాధిపతి డా.పీకే జయలక్ష్మి తెలిపారు. వక్తృత్వం, పద్య పఠనం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, హాస్యవల్లరి తదితర పోటీలను హిందీ, సంస్కృతం, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థినులకు అతిథులు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డా.నిర్మల, డా.దీప్తి, సిస్టర్ మేరీ, అంజలే, డా.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 28: పూర్ణామార్కెట్ వద్ద దుర్గాలమ్మ గుడిలో వచ్చే నెల 3 నుంచి 12 వరకు శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, దుర్గాలమ్మగుడి ఈవో పైలా శేఖర్ తెలిపారు. శనివారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణను కలసి ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రారంభోత్సవానికి ఆయనను ఆహ్వానించారు.

అక్కయ్యపాలెం: సుబ్బలక్ష్మినగర్‌లోని చింతామణి గణపతి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ముఖద్వారం ఎదుట దేవి నవరాత్రుల పందిరి రాట ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీవీఎస్ఎల్ రాజు, వసంత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి కటాక్షం అందిరిపైనా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, మళ్ళ శ్రీను దంపతులు, నానాజీ, చరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పిడికిలి బిగిద్దాం రండి

▸▸ ప్రజా సంఘాల నేతల పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతంపేట, సెప్టెంబరు 28: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబరు 2న చేపట్టనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి. రమణమూర్తి, ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ద్వారకా నగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఉద్యమ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రమణమూర్తి మాట్లాడుతూ కేంద్రం విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడానికి దూకుడు పెంచుతున్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ఉదయం 9 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. రాజకీయ నాయకులు పొంతన లేని మాటలతో కార్మికులను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం నుంచి రావద్దన్న 4,090 మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సమావేశానికి విచ్చేసిన ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రం ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఉత్తరాంధ్ర ప్రజానీకం ఉద్యమించాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించారు. ప్రజా సంఘాల నాయకులు ఎం.లక్ష్మి, వై.నూకరాజు, జె.రవి, కె.ఎస్. చలం, కె.పద్మ, సూర్యప్రకాష్, రవి, చినసూర్యనారాయణ, ఉప్పల లక్ష్మణరావు, డెంకాడ ఆనంద్, సీఎంఎస్ లలిత, సుధాకర్, మేడ మస్తాన్ రెడ్డి, పి.ఎన్. తిలక్, ఎస్ఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

'సన్'కు ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ అవార్డు



రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్ జాస్తి, ఆశాజాస్తి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 28: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో నగరానికి చెందిన సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్‌కు ఉత్తమ పర్యాటక విద్యా సంస్థగా రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా సన్ సీఎండీ శ్రీకాంత్ జాస్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 20 సంవత్సరాలుగా విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంతాల్లో ఎంతో మంది విద్యార్థులను పర్యాటక రంగంలో ఉత్తములుగా తీర్చిదిద్దామని తెలియజేశారు. చదువుతో పాటు విదేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాల విలువలు తెలియజేయడం, కళలు, క్రీడ, పండుగల ఆచరణ విధానం విద్యార్థులకు తెలియజేశామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి దుర్గేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 28: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల శనివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు 'వేస్ట్ టు ఆర్ట్' అంశంపై పోటీలు నిర్వహించింది. ఎన్‌సీసీ క్యాడెట్లు తమ సృజనాత్మకతను చూపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ వ్యర్థాల నుంచి ఉపయోగపడే వస్తువులు తయారు చేయడంపై అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు వ్యర్థాల నుంచి గృహాలంకరణ వస్తువులు తయారు చేసి ప్రతిభను నిరూపించుకోవడం ఆనందదాయకమన్నారు. సృజనాత్మకత పెంపొందించడం, ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ కెగీతాంజలి, కో-ఆర్డినేటర్ బి.సంతోషి, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 28: విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలని ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్యాలయం హాల్‌లో భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా సంయుక్త ఆధ్వర్యంలో భారత్ కో జానో , గురువందన్ ఛత్రాభినందన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని బీవీపీ ప్రాంత్ అధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గురువు దైవంతో సమానమని, విద్యార్థులకు గురువు ప్రాముఖ్యతను తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులు వాగ్దేవి పి.శ్యామలతో పాటు ఉత్తమ విద్యార్థులను సత్కరించారు. బీవీపీ ప్రతినిధులు రమేష్‌చంద్ జైన్, ఎంవీవీ సత్యనారాయణ, ఎం.వి.రాజశేఖర్, ఎం.ఎస్.ఎల్.శైలజ, జగదీష్ ప్రసాద్, వెంకటేశ్వరరావు, సీహెచ్‌వీ సత్యనారాయణ, భాస్కరరావు, వి.మాణిక్యాలరావు, పి.షిర్మల, సీహెచ్ నిర్మలాదేవి పాల్గొన్నారు.

శారీరక వ్యాయామంతోనే గుండె పదిలం



బీచ్‌రోడ్డులో ర్యాలీలో పాల్గొన్న వైద్య ప్రముఖులు, ఇతరులు

మహారాణిపేట, సెప్టెంబరు 28: యువతలో గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ డీకే బారుహ్ అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం బీచ్‌రోడ్డులో గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తూ వాక్‌థాన్ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు వైద్య ప్రముఖులు, వైద్యనిపుణులు సుమారు రెండు వేల మందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ధూమపానం, మద్యపానం, నిల్వ పదార్థాలకు (జంక్ ఫుడ్స్) దూరంగా ఉండాలని సూచించారు. రోజూ సుమారు 45 నిమిషాలు నడవాలని, పాఠశాలల్లో యోగా, ధ్యానం ప్రవేశపెట్టాలని తెలిపారు. సెల్ కంప్యూటర్ గేమ్‌లతో ఎక్కువ సమయం గడపవద్దని, ఉప్పు, చక్కెర హానికరమని హెచ్చరించారు. వాక్‌థాన్‌లో ప్రముఖ గుండె వైద్యులు ఎస్.కె.పాణిగ్రహి, డాక్టర్ త్రివేది, డాక్టర్ ఎల్ విజయ, డాక్టర్ సి.శశాంక్, డాక్టర్ చక్రధర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అంధకారం

... 5వ పేజీ తరువాయి

దాటినాసరే మరమ్మతులు చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు ఎన్నిసార్లు నోటీసులు జారీచేసినా పట్టించుకోవడం లేదు. నగరంలో 1.18 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఉండగా వాటిలో ప్రస్తుతం సుమారు 58 వేల వరకూ వెలగడం లేదని అంచనా. దీనివల్ల చీకటిపడితే చాలు అనేక ప్రాంతాల్లో చీకటి రాజ్యమేలుతోంది. కొమ్మాది నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకూ జాతీయ రహదారిపై అనేక స్ట్రెచ్‌లల్లో దీపాలు వెలగడం లేదు. నగర శివారు ప్రాంతాలైన మధురవాడ, పీఎం పాలెం, అగనంపూడి, భీమిలి, వడ్లపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో అయితే రాత్రిపూట అంధకారం సర్వసాధారణంగా మారిపోయింది. నగర నడిబొడ్డున అక్కయ్యపాలెం, రామచంద్రనగర్, ఆబిడ్ నగర్, 80 ఫీట్ రోడ్డు, శ్రీనివాసనగర్, బాలయ్యశాస్త్రిలేఅవుట్, సీతమ్మధార, కంచరపాలెం, కప్పరాడ వంటి ప్రాంతాల్లో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చైన్‌స్నాచింగ్‌లు, ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయి. అలాగే పాదచారులు రాత్రివేళ రోడ్డు దాటుతున్నపుడు వాహనచోదకులు గుర్తించలేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తోపాటు జిల్లా కలెక్టర్ హరేందిర్ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి రాత్రివేళ వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నగరంలో కొన్నిచోట్ల వీధీదీపాలు వెలుగుతున్నాసరే వాటి నుంచి అంతంతమాత్రంగా కాంతి వస్తుండడంతో వాటి ఇల్యుమినేషన్ సామర్థ్యాన్ని పెంచాలని సీపీ కోరారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా కార్పొరేటర్లతోపాటు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సైతం వీధి దీపాల సమస్యపై విరుచుకుపడ్డారు. రాత్రిపూట నగరంలో అరాచకం రాజ్యమేలుతోందని విష్ణుకుమార్‌రాజు ఆగ్రహం వ్యక్తంచేసారు. గంజాయి బ్యాచ్‌లు చెలరేగిపోతున్నాయని, నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. జీవీఎంసీ ఏడాదికి సుమారు రూ.12 కోట్లు ఖర్చు చేస్తున్నా కాంట్రాక్టర్ పనులు ఎందుకు చేయడం లేదంటూ ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. దీనికి కమిషనర్ సంపత్ కుమార్ సమాధానం ఇస్తూ తాను కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదుసార్లు నగరంలో రాత్రిపూట పర్యటన చేసి, వీధి లైట్ల సమస్యపై సమీక్ష చేశానన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కనిపించడంతో అతన్ని ఎందుకు తొలగించకూడదంటూ షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. కొద్దిరోజుల్లో వైఖరి మారకపోతే మరొక నోటీసు జారీచేసి తర్వాత న్యాయపరమైన వివాదాలకు అవకాశం లేకుండా కాంట్రాక్టర్‌ను తొలగిస్తామన్నారు. రెండు నెలల్లో వీధి దీపాల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

3 నుంచి టెట్

... 5వ పేజీ తరువాయి

పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలన్నారు. దివ్యాంగుల కోసం స్క్రైబ్స్‌ను బయట నుంచి అనుమతించరని, ఇందుకు విద్యా శాఖే ఏర్పాట్లుచేయాలన్నారు. దివ్యాంగులకు పరీక్ష రాయడానికి అదనంగా 50 నిమిషాల సమయం కేటాయించాలన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో అభ్యర్థుల కోసం ఉదయం ఏడు నుంచి రాత్రి ఏడు గంటల వరకు కమాండ్ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. సమీక్షలో విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగన్నాథరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాయింట్-1గా మోహన్‌రావు బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూపర్ బజార్ ఆవరణలోని రిజిస్ట్రేషన్ల కార్యాలయంలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా మోహన్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో విజయవాడ ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న గ్రేడ్-1 సీనియర్ సబ్ రిజిస్ట్రార్ సంజీవయ్య ఈ స్థానాన్ని ఎంపిక చేశారు. అయితే, ఏసీబీ కేసులు పెండింగ్ ఉండటంతోపాటు గతంలో ఐజీగా రామకృష్ణ పనిచేసిన సమయంలో సంజీవయ్య షాడో ఐజీగా వ్యవహరించారు. అన్ని జిల్లాల నుంచి ప్రతి పనికి డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ స్థితిలో ఆయనను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కీలక స్థానం నుంచి తప్పించారు. అయితే, బదిలీల కౌన్సెలింగ్‌లో సీనియారిటీ ప్రకారం విశాఖలో జాయింట్-1 పోస్టును ఆయన ఎంచుకున్నారు. గతంలో మధురవాడలో, భీమిలిలో పనిచేసిన సమయంలో అనేక అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడినట్టు ఫిర్యాదులు అందడంతో ఐజీ కార్యాలయం ఆయన బదిలీ ఉత్తర్వులను రద్దు చేసింది. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయం కావడంతో మరో సీనియర్ గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రావును ఆ స్థానంలో నియమించారు. దాంతో ఆయన శనివారం బాధ్యతలు తీసుకున్నారు.

ఉద్యోగాలకు ఇద్దరు కెమికల్ విద్యార్థులు ఎంపిక

కంచరపాలెం, సెప్టెంబరు 29: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో ప్లాస్టిక్స్ & పాలీమర్స్ ఏడో సెమిస్టర్ చదువుతున్న శ్రీ వంశీ (పెట్రో కెమికల్స్), ప్రవీణ్ (ఆయిల్ టెక్నాలజీ) అనే విద్యార్థులు ప్రముఖ కంపెనీ ఆదిత్య బిర్లా పెయింట్స్ డివిజన్‌కు ఎంపికయ్యారు. వీరు ఏడాదికి ప్రారంభ వేతనం రూ.3.3 లక్షలతో ఉద్యోగాలు సాధించారు. తమ విద్యార్థులు ప్రాంగణ ఎంపికద్వారా ఉద్యోగాలు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు అభినందించారు. ఇటీవల తమ కళాశాల విద్యార్థి చైతన్య దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో వార్షికవేతనం రూ.10.4 లక్షలతో ఉద్యోగం సాధించాడని తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను పెట్రోకెమికల్స్ విభాగాధిపతి డా.ఎస్.ప్రశాంత కుమారి, డా.బీవీ.లక్ష్మణరావు, బి.రామాంజనేయులు, బి.స్మిత అభినందించారు.

అనధికార కాల్ సెంటర్లపై దాడులు

... 5వ పేజీ తరువాయి

యజమానికి తెలిపాడు. అయితే, ఒక్కసారిగా వీరి వ్యాపార బాగోతం సీబీఐ అధికారుల మెరుపు దాడులతో బయటపడేసరికి భవన యజమాని కంగుతిన్నారు. కార్యాలయాన్ని మూసి వేసిన సీబీఐ అధికారులు అక్కడకు ఎవరినీ రానివ్వలేదు. వీరి కార్యాలయాల నుంచి లాప్ ట్యాప్‌లు, హార్డ్ డిస్కులు, కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మురళీనగర్‌లో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ తరహా నేరాలకు పాల్పడే కార్యాలయాలు, అనుమానితుల సమాచారం తెలియజేయాలని ప్రజలను పోలీసు అధికారులు కోరారు.

బే వాచ్‌పై విచారణకు ఏపీసీజెడ్ఎంఏ ఆదేశం

... 5వ పేజీ తరువాయి

ఉల్లంఘనపై కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్‌కు ఇటీవల ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దానిపై జిల్లా పర్యాటక శాఖ అధికారిణితో విచారణ చేయించారు. ఆ నివేదిక సమర్పించడంలో జాప్యం జరగడంతో మూర్తియాదవ్ ఏపీసీజెడ్ఎంఏకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దానిని జిల్లా స్థాయి కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్‌కు మెంబర్ కన్వీనర్ పంపించారు. దానిపై విచారణ చేసిచర్యలు తీసుకోవాలన్నారు.

వెనక్కి తగ్గిన ఉక్కు యాజమాన్యం

.. 5వ పేజీ తరువాయి

బయోమెట్రిక్ యంత్రాల నుంచి తొలగించారు. వారు పొరపాటున వచ్చినా హాజరు పడకుండా చేశారు. ఈ విషయం తెలిసి కార్మిక సంఘాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. శనివారం ఉదయం భారీ ర్యాలీ తీసి, నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. ఈ విషయాన్ని ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ఎంపీ శ్రీభరత్‌కు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆందోళనలో పోలీసుల వల్ల ఏమైనా జరిగితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని వివరించారు. దాంతో వారు ఉన్నత స్థాయిలో చర్చలు జరిపారు. సెయిల్‌లో విలీనం చేసే ఆలోచన ఉందని వార్తలు రావడంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు సంతోషంలో ఉన్నాయని, ఇప్పుడు ఈ కాంట్రాక్టు కార్మికుల తొలగింపుతో పరిస్థితి అదుపు తప్పుతుందని, ఆ నిర్ణయం వాయిదా వేయాలని కోరారు. దానికి సమ్మతి లభించడంతో ఆ విషయం కార్మిక సంఘాల నాయకులకు తెలియజేశారు. ప్రస్తుతం ఎవరినీ ఆపడం లేదని, అంతా యథాప్రకారం విధులకు హాజరు కావచ్చుననే సమాచారం పంపారు. దాంతో శనివారం నాటి ఆందోళన ఉధృతి తగ్గిపోయింది.

దశల వారీగా తగ్గింపు

విశాఖ ఉక్కులో ప్రస్తుతం ఉత్పత్తికి అవసరమైన వారి కంటే అధికంగా కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని భావిస్తున్న కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఒక్కసారి కాకుండా దశల వారీగా తొలగించాలని యాజమాన్యానికి సూచించింది. ఇందులో భాగంగా ఎవరినైతే తొలగించాలని గుర్తించారో వారికి ఇచ్చిన గేట్ పాస్‌లు (పసుపు రంగు) వెనక్కి తీసుకోవాలని నిర్ణయించారు. వాటి స్థానంలో తెలుపు రంగు గేట్‌పాస్‌లు ఇస్తారు. ఆ పాస్‌లు కలిగిన వారిని దశల వారీగా ఆపేస్తారు. కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చే గేట్ పాస్ కాలపరిమితి మూడు నెలలు. ఆ సమయం దాటిన తరువాత తొలగించాలనుకున్నవారి పాస్‌లు రెన్యువల్ చేయరు. కొనసాగించాలనుకున్న వారికి మాత్రమే కొత్తవి ఇస్తారు. కార్మిక వర్గాల్లో ఆందోళనకు తావివ్వకుండా గప్‌చుప్‌గా ఈ పని చేయాలని యాజమాన్యానికి సూచించడంతో తొలగింపు ప్రక్రియకు తాత్కాలింగా బ్రేక్ వేశారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అన్యాయం

▸▸ ఒక్కరిని తొలగించినా ఊరుకోం..

▸▸ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

▸▸ యాజమాన్యం తన నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్



జెండాలతో నినదిస్తున్న కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 28: స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మండిపడ్డారు. కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సుమారు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం సరికాదన్నారు. ప్లాంటును రక్షిస్తామని ఒక పక్క ప్రకటనలు చేస్తూనే మరోపక్క తొలగింపు ప్రక్రియకు యాజమాన్యం పూనుకోవడం దారుణమన్నారు. దీనివల్ల కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ప్లాంటు కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆలోచనను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, మంత్రి రాజశేఖర్, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి, దొమ్మేటి అప్పారావు, జె.రామకృష్ణ, నమ్మి సింహాద్రి, పీవీ రమణమూర్తి, జీవీ సుబ్బయ్య, కె.రాజుబాబు, వి.ప్రసాద్, మంత్రి గోపినారాయణ పాల్గొన్నారు.

ఒక్కరిని తొలగించినా ఉద్యమం

స్టీల్‌ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించినా తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. ప్లాంటు ఎల్ఎంఎంఎం విభాగ క్యాంటీన్‌లో శనివారం నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇప్పటికే చాలీచాలనీ జీతాలతో కాలం గడుపుతున్న కాంట్రాక్టు కార్మికులను రోడ్డున పడేసేందుకు యాజమాన్యం చూస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల తొలగింపు సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు మంత్రి రవి, శ్రీనివాసరాజు, అవతారం, అప్పారావు, సొంబాబు పాల్గొన్నారు.

యథావిధిగా విధులకు కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికులు మొత్తం శనివారం విధులకు హాజరయ్యారు. ప్లాంటులో సుమారు నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు సిద్ధమైన యాజమాన్యం...వారి వివరాలను ఆయా కాంట్రాక్టర్‌లకు పంపించింది. అయితే కాంట్రాక్టర్లు మాత్రం కార్మికులను ఆపలేదు. తమకు నోటీసులు ఇస్తే అప్పుడు చూస్తామని సమాధానమిచ్చారు. ఒకేసారి ఇంతమందిని విధుల నుంచి తప్పిస్తే ఉద్యమాలు జరుగుతాయని భావించి దఫదఫాలుగా తొలగించేందుకు యాజమాన్యం యత్నిస్తుందని కార్మిక నాయకులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఒక్క కార్మికుడిని తొలగించినా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డిసెంబరు 8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

భీమునిపట్నం, సెప్టెంబరు 28 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) డిసెంబరు 8న జరగనున్నట్టు ఎంఈవో శివరాణి తెలిపారు. శనివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. విద్యార్థులు వచ్చే నెల 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసిన రసీదు, ఇతర ధ్రువీకరణ పత్రాలను డీఈవో కార్యాలయంలో 14వ తేదీలోగా సమర్పించాలని చెప్పారు. పరీక్ష ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 100, ఎస్సీ, ఎస్టీలకు రూ. 50 అన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు కార్యాలయం వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

మధురవాడ సబ్ రిజిస్ట్రార్‌గా చక్రపాణి

మధురవాడ, సెప్టెంబరు 28 : మధురవాడ సబ్ రిజిస్ట్రార్‌గా భీంపల్లి చక్రపాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్. మోహన్‌రావు పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఐజీ ఆఫీసు నుంచి చక్రపాణి వచ్చారు.

కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

ఆరిలోవ, సెప్టెంబరు 28 : రేబిస్ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని చినగదిలి వైద్య శాలలో శనివారం 31 కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్టు వైద్యాధికారి సజ్జల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలన్నారు. రేబిస్ కోతులు, గబ్బిలాలు, ఎలుకలు, నక్కల ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ విజిలెన్స్ అధికారిగా చిట్టిబాబు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 28 : ఏయూ విజిలెన్స్ అధికారిగా కెమికల్ ఇంజనీరింగ్ ఆచార్యులు ఎస్. చిట్టిబాబు నియమితులయ్యారు. ఈమేరకు రిజిస్ట్రార్ ధనుంజయరావు శనివారం తన కార్యాలయంలో ఉత్తర్వులు అందజేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, సెప్టెంబరు 28 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి శనివారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలదేవి సమేతంగా శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో సహస్రనామార్చన జరిపారు. తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో శ్రీకారం చుట్టి అష్టోత్తర శతనామార్చన చేశారు. మంగళవాయిద్యాల నడుమ భక్తులు గరుడ వాహనం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

కాపు వీధిలో అన్నప్రసాద వితరణ

సింహాచలం, సెప్టెంబరు 28 : జీవీఎంసీ 98వ వార్డు కాపువీధిలో యూనిటీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో 98వ వార్డుకు చెందిన పలు పార్టీల నాయకులు కర్రి అప్పలస్వామి, బంటుబిల్లి మహేష్, ఎన్ని భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆరిలోవ, సెప్టెంబరు 28 : క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. దాదాపు 200 మంది పోటీల్లో పాల్గొనగా ఖోఖో, చెస్, కబడ్డీ, వాలీవాల్, త్రోబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడలు ఆడించారు. కార్యక్రమంలో పీఈటీలు శ్రీనివాస్, వివేకానంద, హెచ్‌ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సత్యం సుందరం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **దేవర :** మెలోడి, జగదాంబ, శారద, రమాదేవి, వెంకటేశ్వర, సంగం, శరత్, శ్రీరామ, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), సుకన్య, సౌజన్య, నరసింహ, శ్రీనరసింహ, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ, సప్తగిరి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 40, టమాటా 44, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 24, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 24, క్యారెట్ 44, దొండకాయలు 40, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 85, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 34, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 68, పొటల్స్ 36, కీరదోస 26, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



భీమిలి మండలం అమనాంలో పర్యటిస్తున్న అధికారులు



పద్మనాభం : గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సునీత

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో అధికారులు

భీమునిపట్నం(రూరల్), సెప్టెంబరు 28 : మండలంలోని అమనాంలో అధికారులు శనివారం 'మనఇల్లు- మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసమీపంలోని లేఅవుట్‌లో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పద్మనాభం, తునివలస,రెడ్డిపల్లి, కృష్ణాపురం, మద్ది గ్రామాల్లో అధికారులు మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ సొంతిల్లు సమకూర్చడానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సునీత, ఎంపీడీఓ విజయ కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆనందపురం : పెద్దిపాలెం సచివాలయంలో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సంతోష్‌కుమార్ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. బిల్లుల సమస్య పూర్తి చేస్తామని, అసంపూర్తి ఇళ్లు పూర్తి చేయాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని చెప్పారు. 2025 మార్చి నాటికి అందరికీ ఇళ్ల సౌకర్యం కల్పిస్తారని తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 28 : రాష్ట్రంలోని వరద బాధితులను ఆదుకునేందుకు ఏయూ అనుబంధ కళాశాలలు ఆర్థిక సహాయం ప్రకటించాయి. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌వీ కిశోర్‌చంద్రదేవ్ డిగ్రీ కళాశాల రూ. 51116, విజయనగరం మాన్సాస్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ రూ.2,5 లక్షల చెక్కులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుకు శనివారం అందజేశారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టీవీ కృష్ణ, ఆయా కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

లా కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ

వెంకోజీపాలెం, సెప్టెంబరు 28 : ఏయూ లా కళాశాలలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ధనుంజయరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు దరి చేరవని చెప్పారు. అనంతరం కళాశాల ఆవరణలో ఉన్న వ్యర్థాలను ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, లా కళాశాల విద్యార్థులు తొలగించి, శుభ్రపరిచారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. సీతా మాణిక్యం, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎన్. హరనాథ్, డాక్టర్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉడుపు రాట

ఆనందపురం, సెప్టెంబరు 28 : మండలంలోని ఎల్‌వీపాలెం పంచాయతీలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు శనివారం ఉడుపు రాట వేశారు. సర్పంచ్ లొడగల రాజేశ్వరి రమణ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు లొడగల వెంకటరావు, ఉప సర్పంచ్ నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ కంచిబోయిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్నస్వామి ఏకాదశి తిరువీధి



తిరువీధిలో పల్లకీలో ఊరేగుతున్న స్వామివారు

సింహాచలం, సెప్టెంబరు 28 : భాద్రపద మాస బహుళపక్ష ఏకాదశి పురస్కరించుకుని సింహగిరి మాడవీధుల్లో వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి మదనగోపాలస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితులు వేద పారాయణలు, భక్తుల హరినామ స్మరణ నడుమ మాడవీధుల్లో స్వామివారు పల్లకిలో ఊరేగారు. మార్గం పొడవునా భక్తులు ఫలాల నివేదనలిచ్చి కర్పూర హారతులతో స్వాగతించారు.

రైఫిల్ పోటీల్లో సిమ్స్ విద్యార్థికి సిల్వర్ మెడల్

మధురవాడ, సెప్టెంబరు 28 : మధురవాడ శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సిమ్స్)లో బీబీఏ చదువుతున్న మణికంఠ గోవాలో రైఫిల్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. మణికంఠను సిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపికాదాస్, అధ్యాపకులు శనివారం అభినందించారు.

యువకుడ్ని రక్షించిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్ సెప్టెంబరు 2 : బీచ్‌లో కొట్టుకుపోతున్న ఓ యువకుడ్ని లైఫ్‌గార్డులు కాపాడారు. జార్ఖండ్‌కు చెందిన ముగ్గురు యవకులు విహార యాత్రకు శనివారం రుషికొండ వచ్చారు. వారిలో పదిహేడేళ్ల యువకుడు అలల ఉధృతికి కొట్టుకుపోతుండగా, అక్కడ ఉన్న లైఫ్‌గార్డులు రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు.



ఎమ్మెల్యే గంటాకు సమస్యను వివరిస్తున్న టీడీపీ నాయకులు

ముంపు సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

పద్మనాభం, సెప్టెంబరు 28 : పొట్నూరు గ్రామంలో దొమ్మరి గెడ్డ ముంపు సమస్యను పరిష్కరించాలని కోరుతూ పద్మనాభం మండల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. శనివారం వారు భీమిలిలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోకి వెళ్లడానికి గెడ్డపై ఉన్న కాజువే పూర్తిగా శిథిలమైందన్నారు. ఆ స్థానంలో ఎత్తుగా కొత్త కాజ్‌వే నిర్మించాల్సి ఉందని వివరించారు. గెడ్డ నీటితో వర్షాకాలంలో గొలగాని వారి కళ్లాల్లో నివసిస్తున్న కుటుంబాలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు. కళ్లాల వద్ద కూడా కాజ్‌వే నిర్మించాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ నాయకులు నందీశ్వరరావు, శ్రీరామ్మూర్తి, సత్యనారాయణ, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు సుమంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ బాలికల ప్రతిభ

ఆనందపురం, సెప్టెంబరు 28 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు సత్తాచాటారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన 40 విద్యార్థులకు ఎంఈవో గంగరాజు ఆధ్వర్యంలో శనివారం ఈ పోటీలు నిర్వహించారు.

భీమునిపట్నం : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరినాలో నిర్వహించిన వివిధ పోటీల్లో స్థానిక కస్తూర్బా విద్యాలయం బాలికలు బహుమతులు పొందినట్టు ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. శనివారం విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలను స్కూల్ కమిటీ చైర్మన్ కుమార్ అభినందించారు.

'మధురవాడ సంతను తరలించొద్దు'

కొమ్మాది, సెప్టెంబరు 2: మధురవాడ సంతను కొమ్మాది కూడలికి మార్చాలనుకోవడం దారుణమని వర్తక సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. సంత తరలింపును ఆపాలని కోరుతూ శనివారం వారు జోన్-2 కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొమ్మాది కూడలిలో సంత ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కాగా అంతకముందు మధురవాడకు చెందిన టీడీపీ నాయకులు, జోనల్ కమిషనర్ సింహాచలం, ట్రాఫిక్ సీఐ కాంతారావు, ఎస్ఐతో చర్చలు జరిపారు. చర్చలు ఫలించకపోవడంతో జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

ఆరిలోవ, సెప్టెంబరు 28 : మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీసు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా వారి ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం దారుణమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, అంబేడ్కర్ అన్నారు. శనివారం వారు డీఈవో కార్యాలయ పర్యవేక్షణ అధికారి సుందర సింగ్‌కు నిరసనలకు సంబంధించిన నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై వచ్చేనెల 2 నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపడతామన్నారు. 17న డీఈఈ కార్యాలయం వద్ద ధర్నా, 24న విజయవాడలోని విద్యా శాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట 24 గంటల పాటు దీక్ష చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్, తాటికొండ జగన్ పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



సాహితీవేత్త రామలింగేశ్వరరావును సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం, సెప్టెంబరు 28 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహితీవేత్త, నంది అవార్డు గ్రహీత మీగడ రామలింగేశ్వరరావును కళాశాల సిబ్బంది సన్మానించారు. అనంతరం రామలింగేశ్వరరావు మాట్లాడుతూ జాషువా చైతన్య పూరిత కవిత్వం సమాజంలో మానవ సమానత్వాన్ని వెలుగెత్తిచాటిందన్నారు. దళితుల సాధక బాధలు తన ప్రసంగాల్లో వివరించారన్నారు. ఆయన రచించిన గబ్బిలం, పిరదౌసి, ముంతాజ్, మహల్ స్వప్న కథలు సృజనాత్మకతకు అభ్యుదయ భావాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు కుసుమకుమారి, సూర్యనారాయణ, ఉమామహేశ్వరరావు, గోపాల్‌నాయుడు, శ్రావణ్‌కుమార్, లక్ష్మీ, రాణి పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : ఏయూ తెలుగు విభాగంలోనూ గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్ పాల్గొన్నారు. అలాగే ఏయూ ఆర్ట్స్ కళాశాలలో గుర్రం జాషువా చిత్రపటానికి పలువురు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట్, డాక్టర్ ఎం. ప్రసాద్ పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయంలో దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పెదవాల్తేరు, సెప్టెంబరు 28 : పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ దేవాలయంలో వచ్చేనెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. శనివారం ఆయన ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గాయత్రి, 18వ వార్డు టీడీపీ నాయకులు గొలగాని పోలారావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 28 : పట్టణంలోని ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 14 నుంచి 17 వరకూ తృతీయ తిరు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్టీలు తెలిపారు. శనివారం వారు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె. భానోజీరావు, కె. శ్రీనివాసరావు, ఉసిరికల తాతాజీ, ఆలయ అర్చకుడు శేషాచార్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైసీపీ నాయకుల పూజలు



మధురవాడ : ఆలయంలో పూజ చేస్తున్న నాయకులు

ఆరిలోవ, సెప్టెంబరు 28 : తిరుపతి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగినట్టు దుష్ప్రచారం చేయడం తగదని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కూటమి నేతల ఆరోపణల నేపథ్యంలో ఆరిలోవలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మేయర్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లడ్డూ కల్తీపై కూటమి నేతలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వానపల్లి ఈశ్వరరావు, రాజబాబు, తదితరలు పాల్గొన్నారు. కాగా ఈ నిరసనలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన వైసీపీ కార్పొరేటర్లు పాల్గొనకపోవడం గమనార్హం.

తగరపువలస : లడ్డూపై కూటమి నేతలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అవాస్తవాలు ప్రచారం చేయడం తగదని వైసీపీ నాయకులు అన్నారు. శనివారం వారు తగరపువలసలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 1,2,3 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాచలం : లడ్డూ వివాదంలో వాస్తవాలు భక్తులకు తెలియాలని, దోషులకు శిక్ష పడాలని కోరుతూ వైసీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరంబాబు సారథ్యంలో కార్యకర్తలు వరాహలక్ష్మీనృసింహస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో అడివివరం సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు లంక సత్తిబాబు, బొట్టా శ్రీను, అదిరెడ్డి పాల్గొన్నారు.

ఆనందపురం : గంభీరం వద్ద ఉన్న శ్రీ శరణ్య వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, బంక సత్యనారాయణ, గండ్రెడ్డి శ్రీనివాస్, పాండ్రంకి శ్రీను, చందక సూరిబాబు పాల్గొన్నారు.

మధురవాడ : శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు చేశారు. కార్యక్రమంలో పోతిన శ్రీనివాసరావు, పిళ్లా సూరిబాబు, కృష్ణమూర్తిపాత్రుడు, వంకాయల మారుతీప్రసాద్ పాల్గొన్నారు.



మూలకుద్దు గ్రామస్తులతో సమావేశమైన కేంద్ర బృందం

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పరిశీలన

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 28 : కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలును తెలుసుకునేందుకు అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈమేరకు మూలకుద్దు గ్రామంలో పర్యటించిన వారు స్థానికులతో సమావేశమై పలు అంశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, ఇతర పథకాలు ఎలా అమలవుతున్నాయని ఆరా తీశారు. గ్రామస్తులు చెప్పిన విషయాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి అప్పలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తమ్మ తల్లి ఆలయం పునఃప్రారంభం



ఆలయాన్ని పునఃప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి దంపతులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 28 : తూర్పు నియోజకవర్గంలోని వాసువానిపాలెం, శివగణేష్‌నగర్, మూలపాలెం గ్రామస్తుల ఆరాధ్య దేవత కొత్తమ్మతల్లి ఆలయం పునర్నిర్మాణం తరువాత ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సుజన దంపతులు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, గొలగాని పోలరావు, మద్దిల రాజశేఖర్, బైరెడ్డి పోతన్నరెడ్డి, తెడ్డు రాజు, మత్స్యకార నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ యువతకు ఆదర్శం



భీమిలిలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 28 : హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో స్వాతంత్ర్య పోరాట యోధుడు సర్దార్ భగత్‌సింగ్ 117వ జయంతి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మధురెడ్డి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు పడాల గోవింద్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోయిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అన్నారు. ఆయన్ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి అశోక్, ఉపాధ్యక్షుడు బాలు, హరీష్, తేజ, రాజు, శ్రీను పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో ఆంగ్లేయుల స్థావరాలపై దాడులు చేసి కొల్లగొట్టిన ధీరుడు భగత్‌సింగ్ అన్నారు. ఆయన జీవిత చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్‌కుమార్, సంకురుభుక్త జోగారావు, అప్పికొండ నూకరాజు, పోలిరాజు, వియ్యపు పోతురాజు పాల్గొన్నారు.

కేజీబీవీలో నిర్మాణ పనులను నిలిపివేసిన ఎస్‌ఎంసీ

భీమునిపట్నం, సెప్టెంబరు 28 : భీమిలి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జరుగుతున్న నిర్మాణ పనులను విద్యాలయం స్కూల్ కమిటీ నిలిపివేసింది. శనివారం కమిటీ సభ్యులు విద్యాలయంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి అధ్యక్షతన సమావేశమయ్యారు. తమకు తెలియకుండా విద్యాలయంలో నిర్మాణ పనులు ఏవిధంగా ప్రారంభించారని సభ్యులు ప్రశ్నించారు. తమకు తెలియకుండా జరుగుతున్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని కమిటీ ఛైర్మన్ కుమార్ చెప్పారు. ఈ సమావేశంలో సభ్యులు పి. శ్రీను, బైరవుడు, ఎస్. త్రినాథ్, ఎం. సత్యవతి, చోడవరపు నాగరాజు, ఎస్. అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.